www.ninadam.in

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

శుక్రవారం ఏప్రిల్ 24 2026

ninadam.in

మంత్రులు, ఎమ్మెల్యేల

# జీతాల్లో కోత..

**తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపుల కోసం కీలక నిర్ణయం**

- వచ్చే 100 రోజుల్లో ఈ మొత్తాన్ని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- నిధుల సమీకరణకు డిప్యూటీ సీఎం నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ భారం పడిందని మంత్రి పొంగులేటి విమర్శ
- మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50% కోత విధించే ప్రతిపాదనకు కేబినెట్ సుముఖత



**హైదరాబాద్ ఏప్రిల్ 24 (నినాదం) :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్రాంత ఉద్యోగులకు భారీ ఊరట కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గత పదేళ్లుగా పేరుకుపోయిన రూ.6,200 కోట్ల రిటైర్మెంట్ బకాయిలను రాబోయే 100 రోజుల్లో చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. 2014 తర్వాత పదవీ విరమణ పొంది, రావాల్సిన ప్రయోజనాలు అందక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల పట్ల మానవీయ దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. బకాయిల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు, అవసరమైన నిధుల సమీకరణకు 02

## నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

- మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ
- తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి



**హైదరాబాద్ ఏప్రిల్ 24 (నినాదం) :** నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ.. “క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచింది“ అని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్చలు జరుపుతోందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టీసీ కార్మికులు ఎవరూ ఎలాంటి తొందరపాటు, ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు.



# ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ

- సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, లక్ష్మణ్
- శంకర్ గౌడ్ మృతిపట్ల మంత్రులు, జేఏసీ నేతల సంతాపం
- 29 అంశాలకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపిన మంత్రులు
- మూడు అంశాలపై అధ్యయనం చేయాలన్న మంత్రులు

**లిఖితపూర్వక హామీకి జేఏసీ నేతల డిమాండ్**


**శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షలు, ఉద్యోగం**

**హైదరాబాద్:** తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ భేటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, ప్రత్యేక సీఎస్ వికాస్ రాజ్ కూడా హాజరయ్యారు. వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రులు, జేఏసీ నేతలు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రులు భరోసా ఇచ్చారు. ఏ కార్మికుడు కూడా ఆవేశంతో అనాలోచిత నిర్ణయం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణమే అమలు చేయాలని జేఏసీ నేతలు 02

## ఆర్టీసీ జేఏసీ నేతలతో సమావేశమైన ఐఏఎస్‌ల కమిటీ



ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నేతలతో సచివాలయంలో ఐఏఎస్ అధికారుల కమిటీ సమావేశమైంది. ఉద్యోగులతో భేటీలో కమిటీ ఛైర్మన్ వికాస్‌రాజ్, సభ్యులు దానకిశోర్, సందీప్ సుల్తానియా, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి పాల్గొన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన శంకర్‌గౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని జేఏసీ నేతలు కోరారు. ప్రభుత్వంతో చర్చించి ప్రకటిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కుటుంబాల భారం పెరిగిందని, ఆర్థిక ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ సంఘాల నేతలు కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.




బెంగాల్‌లో ఓటింగ్ శాతాన్ని చూసి

## చాలా సంతోషించా

\- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

- ‘ఎస్ఐఆర్‘ కేసు విచారణ సందర్భంగా పోలింగ్ శాతంపై సుప్రీంకోర్టు స్పందన 02
- పోలింగ్ ప్రశాంతంగా ముగియడంపై ప్రశంసలు

కొత్త AI ‘మిథోస్‘ కలకలం..

## బ్యాంకర్లకు నిర్మలా సీతారామన్ హెచ్చరిక

- ‘క్లాడ్ మిథోస్‘ అనే కొత్త AI సైబర్ భద్రతకు ముప్పుగా మారిందన్న ఆందోళనలు
- నిర్మలా సీతారామన్ బ్యాంకర్లతో ఉన్నతస్థాయి సమావేశం



**ఢిల్లీ, ఏప్రిల్ 24 (నినాదం) :** “క్లాడ్ మిథోస్“ అనే అత్యంత శక్తిమంతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) మోడల్ వల్ల భారత బ్యాంకింగ్ రంగానికి పొంచి ఉన్న సైబర్ ముప్పుపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా 02

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా

## ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 24( నినాదం) :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రభుత్వం అధికారులను సూచించారు. శుక్రవారం నల్లగొండ తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో తరుగు తీస్తున్నారనే 02

ఆర్టీసీ కార్మాకులకు

## రేవంత్ తీరని ద్రోహం

- రేవంత్ నిర్లక్ష్యమే శంకర్ గౌడ్‌ను బలితీసుకుంది
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 24(నినాదం) :** వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు.. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని 02

## బీఆర్ఎస్ పార్టీపై మరోసారి విమర్శలు గుప్పించిన కవిత

- బీఆర్ఎస్ పార్టీ పేరుతో పాటు ఆత్మను కూడా మార్చుకుందని విమర్శ
- తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఇంకా మిగిలే ఉన్నాయన్న కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 24( నినాదం) :** తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం పాతిక సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ పుట్టిందని, కానీ గత కొన్నేళ్లుగా ఆ పార్టీ తన పేరుతో పాటు పనితీరును, పార్టీ ఆత్మను కూడా మార్చుకుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. రేపు కొత్త రాజకీయ పార్టీని 02

ఆత్మహత్యలొద్దు..

# తెగించి పోరాడుదాం




**ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకుంటే పతనం తప్పదు**

**యూనియన్లంటే పాలకులకు భయమెందుకు**

**కొత్తగూడెం, ఏప్రిల్24(నినాదం)** సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, తెగించి పోరాడి హక్కులను సాధించుకుందామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ ఔట్ గేట్ నుంచి ఇన్ గేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి బస్టాండు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని, ఆర్టీసీ కార్మికులతో తగవు పెట్టుకోవడం పాలకుల వినాశనానికి నాంది పలికే ప్రమాదం ఉందని, గత ప్రభుత్వ తప్పిదమే ప్రస్తుత ప్రభుత్వం 02

- ప్రజారవాణాను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర
- చట్టపరమైన సమ్మెపై నిర్బంధాలు ఆపండి
- మొండివైఖరితో ఎమర్జెన్సీ పరిస్థితులు తీసుకొస్తున్నారు
- న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి సమ్మెను నివారించండి
- డిమాండ్లు పరిష్కరించేవరకు ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటాం
- శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

మే 4 ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలకు

## దాక్కోవడానికి చోటు దొరకదు

- బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారన్న మోదీ
- తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేకి అని ఆరోపణ



**ఢిల్లీ, ఏప్రిల్ 24 (నినాదం) :** మే 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గూండాలకు దాక్కోవడానికి బెంగాల్‌లో ఎక్కడా చోటు దొరకదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారని, ఇది ప్రజాస్వామ్య విజయంగా ఆయన అభివర్ణించారు. ఈ ఓటింగ్ శాతాన్ని చూసి టీఎంసీకి భయం పట్టుకుందని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రజలకు జరిగిన ప్రతి అన్యాయానికి, దౌర్జన్యానికి సంబంధించిన ఫైల్స్‌ను బయటకు తీస్తామని హెచ్చరించారు. ఈ రాష్ట్రం 02



పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో

## విజయం బీజేపీదే

- మొదటిదశలో 110కి పైగా సీట్లు గెలుస్తాం
- కేంద్రహోంమంత్రి అమిత్ షా ధీమా

**కోల్‌కతా, ఏప్రిల్ 24( నినాదం) :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం బీజేపీదే అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మొదటి దశ ఎన్నికల్లో 152 స్థానాలకు గాను బీజేపీ 110కి పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం 02



## శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరం

- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్య

**కరీంనగర్, ఏప్రిల్ 24( నినాదం) :** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... 'ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కార్మికుడి ఆత్మహత్య.. ఇది ప్రభుత్వ హత్య' అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం బెదిరిస్తోందని ఆరోపించారు. ఇంత పెద్ద సమ్మె జరిగితే.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ సర్కార్ చేసిన తప్పే.. 02

## సీఎం హామీపై దుష్ప్రచారం..

ఫేక్ వీడియోలపై మంత్రి లోకేష్ సీరియస్ వార్నింగ్

- సీఎం చంద్రబాబు హామీపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన మంత్రి నారా లోకేష్
- బ్యాటరీ ఆటో హామీపై అసలు వాస్తవాలను వెల్లడించిన ప్రభుత్వం
- ఫేక్ వీడియోలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక



**అమరావతి ఏప్రిల్ 24 (నినాదం) :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై మంత్రి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియోలను ఎడిట్ చేసి దుష్ప్రచారం చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వైసీపీ ఎన్నిసార్లు చెప్పినా తన తప్పుడు ప్రచారాల అలవాటును మార్చుకోవడం లేదని విమర్శించారు.

అసలేం జరిగిందంటే..

తిరుపతి జిల్లా నాయుడుపేటలో మార్చి 02

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో

## భారీ పోలింగ్

- ప్రజాస్వామ్యానికి శుభపరిణామమన్న రాంచందర్ రావు
- తెలంగాణలో కూడా ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయాలని వ్యాఖ్య



**హైదరాబాద్,ఏప్రిల్ 24( నినాదం) :** తమిళనాడులో మొత్తం అసెంబ్లీ స్థానాలకు, పశ్చిమబెంగాల్ లో తొలి విడత ఎన్నికలకు నిన్న పోలింగ్ జరిగింది. అయితే, ఊహించని స్థాయిలో పోలింగ్ నమోదు కావడంతో ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీల్లో టెన్షన్ మొదలయింది. అనూహ్యంగా పెరిగిన ఓటింగ్ శాతం ప్రస్తుత ప్రభుత్వాలకు అనుకూలంగా పడిందా? లేక వ్యతిరేకంగా పడిందా? అనే చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. తమిళనాడు 02



క్రికెట్‌లో ఉన్నట్లు రోడ్డుపై

## ‘డీఆర్ఎస్‘ సిస్టం ఉండదు

- మీ వికెట్ మీరు పారేసుకుంటే శాశ్వతంగా పైకి పోతారన్న సజ్జనార్
- యమధర్మరాజు వద్ద డెత్ రివ్యూ సిస్టం ఉండదని వ్యాఖ్య 02
- క్రికెట్ అభిమానం ఉండొచ్చు.. వెర్రి పిచ్చి మాత్రం ఉండవద్దని సూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 24( నినాదం) :** రోడ్డు మీద నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ మీ వికెట్ పారేసుకుంటే మీరు పర్మినెంట్‌గా పైకి వెళతారని, క్రికెట్‌లో ఉన్నట్లు డీఆర్ఎస్ సిస్టం ఉండదని హైదరాబాద్ సీపీ సజ్జనార్ చమత్కరించారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్‘ వేదికగా ట్వీట్

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
EVENING 6 PM
02
డిజిటల్ ఎడిషన్
శుక్రవారం ఏప్రిల్ 24 2026
ninadam.in

## శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరం

కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో కూడా ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 28వ పేజీలో ఆర్టీసీని విలీనం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. రెండు పీఆర్‌సీలు చెల్లిస్తామని హామీ ఇచ్చారంటూ కాంగ్రెస్ మేనిఫెస్టోను కేంద్ర మంత్రి చదివి వినిపించారు. ఆర్టీసీ సమస్యలపై బీజేపీ పోరాడితే.. ఓటు కాంగ్రెస్‌కు వేశారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో కోత విధిస్తే ఎంత వస్తుంది. ఆ డబ్బులు బఠానీలు కొనుక్కోవడానికి కూడా సరిపోవు. ఢిల్లీకి పైసల మూటలు పంపడం ఆపితే కార్మికులకు డబ్బులు ఇవ్వొచ్చు' అంటూ సర్కార్‌కు కేంద్ర మంత్రి హితవుపలికారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు తెలంగాణ నుంచే డబ్బులు వెళ్తున్నాయని ఆరోపించారు. మేనిఫెస్టోను ప్రధాని మోదీని అడిగి తయారు చేశారా అంటూ కాంగ్రెస్‌పై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ పార్టీపై మరోసారి విమర్శలు గుప్పించిన కవిత

ప్రకటించనున్న నేపథ్యంలో ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడారు. పేరు మార్పు మొదలు ప్రతి విషయంలో టీఆర్ఎస్ మారిందని, దీనితో ఆ పార్టీకి ప్రజలతో ఉన్న పేగుబంధం తెగిపోయిందని అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా తన ప్రాథమిక ఉద్దేశం, మూల సిద్ధాంతం నుంచి పక్కకు తప్పుకుంటే ఆ పార్టీ ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని అన్నారు. బీఆర్ఎస్ తన ప్రాథమిక ఉద్దేశం నుంచి పక్కకు తప్పుకోవడం వల్ల ఆ పార్టీకి ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం మారినా తెలంగాణలో ఎన్నో సమస్యలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆంక్షలు ఇంకా మిగిలే ఉన్నాయని అన్నారు. వీటిని సాధించడమే తాను ప్రారంభించబోయే పార్టీ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజల కోసం పని చేసే స్వచ్ఛమైన ప్రాంతీయ పార్టీ అవసరం ఇప్పుడు తెలంగాణకు ఉందని అన్నారు.

## క్రికెట్‌లో ఉన్నట్లు రోడ్డుపై 'డీఆర్ఎస్' సిస్టం ఉండదు

చేశారు. "మీరు చూసే ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్)లో డీఆర్ఎస్ (డెసిషన్ రివ్యూ సిస్టమ్) ఉంటుంది కానీ యమధర్మరాజు వద్ద మాత్రం డీఆర్ఎస్ (డెత్ రివ్యూ సిస్టం) ఉండదు" అని పేర్కొన్నారు. క్రికెట్ మైదానంలో వికెట్ పడితే ప్లేయర్ పెవిలియన్‌కి వెళ్తాడని, కానీ రోడ్డు మీద నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ మీ వికెట్ పారేసుకుంటే మాత్రం శాశ్వతంగా పైకి వెళతారని హెచ్చరించారు. క్రికెట్‌లో అంపైర్ నిర్ణయంపై రివ్యూ అడిగే అవకాశం ఉంటుందని, కానీ రోడ్డు మీద ఇష్టారీతిన డ్రైవింగ్ చేస్తే డీఆర్ఎస్ అవకాశం ఉండదని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌లో స్కోర్ బోర్డు చూస్తూ మీ జీవితాన్ని 'జీరో'కి క్లీన్ బౌల్డ్ చేసుకోవద్దని సూచించారు. మీకు మ్యాచ్ ముఖ్యం కావొచ్చు కానీ మీ కోసం ఇంట్లో ఎదురుచూసే మీ కుటుంబానికి మీరు మాత్రమే ముఖ్యమని గుర్తుంచుకోవాలని అన్నారు. క్రికెట్‌పై అభిమానం ఉండటంలో తప్పులేదని, కానీ ప్రాణాలు తీసే వెర్రి పిచ్చి మాత్రం ఉండవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒక వీడియోను షేర్ చేశారు.

## తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో భారీ పోలింగ్

(84.80%), పశ్చిమ బెంగాల్ (91.91%) లలో నిన్న జరిగిన పోలింగ్‌లో రికార్డు స్థాయి ఓటింగ్ నమోదు కావడంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఇంత భారీ స్థాయిలో ఓటింగ్ జరగడం అనేది ప్రజలు ప్రస్తుత వ్యవస్థలో మార్పును కోరుకుంటున్నారని స్పష్టం చేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఓట్లు ప్రభుత్వాల మార్పు కోసమే పడి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రక్షాళన (SIR)ను ఆయన అభినందించారు. డూప్లికేట్ ఓట్లు, అక్రమ ఓట్లు, చనిపోయిన వారి పేర్లను తొలగించడం ద్వారా 'క్లీన్' ఓటర్ లిస్ట్ సిద్ధమైందని, ఆ తర్వాత కూడా ఓటింగ్ శాతం పెరగడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని పేర్కొన్నారు. ఇదే తరహాలో తెలంగాణలో కూడా ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని, తద్వారా అసలైన ఓటర్లకు న్యాయం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు.

## మే 4 ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలకు దాక్కోవడానికి చోటు దొరకదు

విప్లవాల గడ్డ అని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలను ఎవరూ కాపాడలేరని అన్నారు. మమతా బెనర్జీ సాగిస్తున్న అటవిక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. మొదటి దశలో పోలింగ్ రికార్డు స్థాయిలో నమోదు కావడం పట్ల మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. బెంగాల్‌లో మహిళలకు గౌరవం, భద్రత, సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు.

## మరో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం.. భూపాలపల్లిలో పురుగులమందు తాగిన రవీందర్



**భూపాలపల్లి ఏప్రిల్ 24 (నినాదం) :** తమ సమస్యల పరిష్కారానికి మరో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యకు యత్నించాడు. భూపాలపల్లి ఆర్టీసీ డిపోనకు చెందిన రవీందర్ అనే డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన తోటి సిబ్బంది అతన్ని వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రతికి తరలించారు. తెలంగాణటూరిజం ప్యాకేజీలు

# ఆత్మహత్యలొద్దు.. తెగించి పోరాడుదాం






చేస్తోందని విమర్శించారు. కార్మిక యూనియన్లంటే పాలకులకు ఎందుకు అంత భయమని, హక్కుల కోసం పోరాడే గొంతులను నొక్కేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రజారవాణా వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, గుర్తింపు సంఘం ఎన్నికలు, వేతన సవరణ, పనిభద్రత, బకాయిలు, పనిభద్రత, కొత్తబస్సుల కొనుగోలు తదితర డిమాండ్లు ప్రభుత్వానికి సాధ్యం కానివికాదని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ చట్టబద్ధంగా సమ్మె చేస్తుంటే అరెస్టులు, అక్రమ నిర్బంధాలు ఎందుకు విధిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకుండా రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను తీసుకొస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు తాము ఆర్టీసీ కార్మికులకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తక్షణమే ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు పెరిగే కొద్దీ ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, మిర్యాల రంగయ్య, ఎస్ కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, కె రత్నకుమారి, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి,, నాయకులు ఎర్రబెల్లి శంకర్, గుమ్మడెల్లి దుర్గయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, యూసుఫ్, సత్యనారాయణా చారి, షాహీన్, కైసర్, మేదిని లక్ష్మి, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ

పట్టుబట్టారు.

కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రులు తెలిపారు. మిగిలిన మూడు అంశాలపై అధ్యయనం కోసం కొంత సమయం కావాలని అన్నారు.

అయితే ఏయే డిమాండ్లు ఎప్పటిలోగా అమలు చేస్తారో లిఖితపూర్వక హామీ ఇవ్వాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

### శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల సాయం.. ఒకరికి ఉద్యోగం

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శంకర్ గౌడ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని మంత్రి తెలిపారు. ఆ కుటుంబానికి రూ.10 లక్షల సాయం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రకటించారు. శంకర్ గౌడ్ అంత్యక్రియలు పూర్తయ్యేలా జేఏసీ నేతలు చొరవ తీసుకోవాలని కోరారు. ఆపత్కాలంలో రాజకీయాలు చేయవద్దని విపక్షాలకు సూచించారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

# పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో విజయం బీజేపీదే

చేశారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో ఉన్న ఆయన కోల్‌కతాలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమన్నారు. రెండో దశలోనూ తామే ఎక్కువ సీట్లు నెగ్గుతామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజేపీనే అంటూ ప్రకటించారు. మమతా బెనర్జీ, టీఎంసీ ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదని హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. అందుకు మొదటి దశలో 92.88 శాతం ఓటింగ్ నమోదు కావడమే నిదర్శనమన్నారు. బెంగాల్ ఓటర్లు అభివృద్ధిని ఎంచుకున్నారని తొలి దశ ఎన్నికలతో స్పష్టమైందని చెప్పుకొచ్చారు. బెంగాల్‌లో మార్పు కోసం ప్రజలు ఉత్సాహంగా ఓట్లు వేశారన్నారు. మహిళల రక్షణ బీజేపీ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అవినీతిపరులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. బెంగాల్‌లో బీజేపీ, పార్టీ అభ్యర్థులు తమ అంచనాలకు తగినట్లుగా పని చేశారని కితాబిచ్చారు. మరోవైపు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా పోలింగ్ పక్రియను నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, స్థానిక పోలీసులు, భద్రతా దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలం తర్వాత ఒక్కరి ప్రాణం కూడా పోకుండా జరిగిన బెంగాల్ ఎన్నికలు ఇవేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కాగా, ఈనెల 23న పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులో 234 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరగ్గా.. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం తొలి దశలో 152 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన 142 స్థానాలకు ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెల్లడిస్తారు.

## శవ రాజకీయం వద్దు.. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- **బండి సంజయ్ శవ రాజకీయం చేస్తున్నారని మండిపాటు**
- **శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అద్దంకి దయాకర్ వెల్లడి**



**హైదరాబాద్, ఏప్రిల్ 24(నినాదం) :** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషాదాన్ని రాజకీయంగా వాడుకోవడం సరికాదని ఆయన అన్నారు. శంకర్ గౌడ్ మరణం అత్యంత బాధాకరమని, ప్రభుత్వం ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా బాధిత కుటుంబాన్ని కలిసి ఆదుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మరోవైపు, కేంద్ర మంత్రి హోదాలో ఉండి బండి సంజయ్ శవ రాజకీయం చేస్తున్నారని, కార్మికులను రెచ్చగొట్టి నర్సంపేటలో ఉద్రిక్తతలకు కారణమవుతున్నారని దయాకర్ ఆరోపించారు. గతంలో సమ్మె చేసిన ఆర్టీసీ కార్మికుల పట్ల అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా వ్యవహరించిందో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. క్షుద్ర రాజకీయాలు చేసే పార్టీలను నమ్మవద్దని, ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, కార్మికులు ఎవరూ తొందరపడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాజ్యసభలో ఆప్ డీలా... పెరగనున్న బీజేపీ బలం

- **ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ షాక్ ఇచ్చిన ఎంపీ రాఘవ్ చద్దా**
- **పార్టీకి చెందిన 10 మంది రాజ్యసభ ఎంపీల్లో 7 మందితో బీజేపీలో విలీనం**
- **హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్ కూడా బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటన**
- **ఆప్‌లో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని చద్దా ఆరోపణ**
- **తన స్థానంలో నియమించిన కొత్త డిప్యూటీ లీడర్‌ను కూడా తన వెంట తీసుకెళ్లిన చద్దా**



**ఢిల్లీ, ఏప్రిల్ 24 (నినాదం) :** ఆమ్ ఆద్మీ పార్టీకి (ఆప్) రాజ్యసభలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ సీనియర్ నేత, ఎంపీ రాఘవ్ చద్దాతో పాటు మొత్తం ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. రాఘవ్ చద్దాతో కలిసి ప్రముఖ క్రికెటర్ హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్, అశోక్ మిట్టల్ వంటి ముఖ్య నేతలు కూడా పార్టీ మారడం ఢిల్లీ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన రాఘవ్ చద్దా, ఆప్‌లోని పది మంది రాజ్యసభ సభ్యుల్లో ఏడుగురు సభ్యులం బీజేపీలో విలీనం కావాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. ఎంపీలు అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్‌లతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన రాఘవ్ చద్దా, తమ వర్గం బీజేపీలో విలీనం అవుతున్నట్లు అధికారికంగా వెల్లడించారు. "రాజ్యాంగంలోని నిబంధనలకు అనుగుణంగా, రాజ్యసభలోని ఆప్ సభ్యుల్లో మూడింట రెండొంతుల మందిమి బీజేపీలో విలీనం కావాలని నిర్ణయించుకున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఈ పరిణామంతో రాజ్యసభలో బీజేపీ బలం మరింత పెరగనుంది. ప్రస్తుతం బీజేపీ 106 మంది సభ్యులతో పెద్దల సభలో అతిపెద్ద పార్టీగా కొనసాగుతోంది. తాజాగా ఆప్ నుంచి ఏడుగురు ఎంపీల చేరికతో బీజేపీ బలం 113కి పెరగనుంది. అంతేకాదు, మిత్రపక్షాలతో కలిపి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి బలం 125కి చేరుతుంది.

కొన్ని రోజుల క్రితమే రాఘవ్ చద్దాను రాజ్యసభలో పార్టీ డిప్యూటీ లీడర్ పదవి నుంచి ఆప్ అధిష్ఠానం తొలగించింది. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. అయితే, ఇప్పుడు చద్దాతో పాటు ఆ కొత్త డిప్యూటీ లీడర్ అశోక్ మిట్టల్ కూడా బీజేపీలో చేరనుండడం గమనార్హం. పార్టీతో విభేదాల నేపథ్యంలో ఇటీవల చద్దా తన పార్లమెంటరీ పనితీరును వివరిస్తూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ తాజా పరిణామంతో ఆప్‌లో అంతర్గత సంక్షోభం తీవ్రస్థాయికి చేరినట్లు స్పష్టమవుతోంది.

## సీఎం హామీపై దుష్ప్రచారం..

30న జరిగిన టిడ్కో ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముక్కర అంబిక అనే లబ్ధిదారురాలి ఇంటికి వెళ్లి సత్యనారాయణ స్వామి వ్రతంలో పాలుపంచుకున్నారు. ఆమె భర్త ఆటో డ్రైవర్ అని తెలుసుకుని, ఆయనకు జీవనోపాధి కోసం ఒక బ్యాటరీ ఆటోను ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌ను అక్కడికక్కడే ఆదేశించారు.

వక్రీకరణ ఇలా..

సీఎం ఆ ఇంటి నుంచి బయటకు వస్తుండగా, ఎదురుగా ఉన్న మరో ఇంటి వద్ద ఒక మహిళ తన చదువుకున్న కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. అయితే కొందరు ఈ రెండు వేర్వేరు సంఘటనలను కలిపి, 'చదువుకున్న యువకుడికి ఆటో కొనిపెడతారట' అంటూ అపహాస్యం చేస్తూ వీడియోలను ఎడిట్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని లోకేష్ తెలిపారు. గతంలోనే ఈ అంశంపై ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం ద్వారా వివరణ ఇచ్చామని, అయినా మళ్లీ అదే అంశంపై దుష్ప్రచారం చేయడం దురుద్దేశపూర్వకమని ఆయన అన్నారు. వీడియోలను తప్పుడు అర్థం వచ్చేలా ఎడిట్ చేసి ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

## మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో కోత..

ప్రభుత్వం తక్షణమే ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉన్న ఈ 'రెవెన్యూ రిసోర్సెస్ మొబిలైజేషన్ కమిటీ' నేటి నుంచే కార్యాచరణను ప్రారంభించనుంది. ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల సంఘాలతో చర్చించి పక్కా ప్రణాళికను సిద్ధం చేయనుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50 శాతం నిలుపుదల చేసి ఆ నిధులను బకాయిల చెల్లింపునకు సర్దుబాటు చేయాలన్న ప్రతిపాదనకు మంత్రులంతా ఏకగ్రీవంగా తమ ఆమోదం తెలిపారు. గురువారం జరిగిన కేబినెట్ భేటీ అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. 2014కు ముందు ఉద్యోగులు రిటైర్ అయిన నెల రోజుల్లోనే అన్ని ప్రయోజనాలు అందేవని, కానీ కేసీఆర్ హయాంలో వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారని ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు ఒక్క రూపాయి కూడా బకాయి లేదని, ఇప్పుడు రూ.6,200 కోట్ల భారాన్ని తమ ప్రభుత్వం బాధ్యతగా స్వీకరిస్తోందని స్పష్టం చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబాలు పడుతున్న ఆవేదనపై కేబినెట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని ఆయన వివరించారు. బకాయిల చెల్లింపు షెడ్యూల్‌పై పూర్తి స్థాయి స్పష్టత కోసం వచ్చే నెల 4వ తేదీన మరోసారి మంత్రివర్గం సమావేశం కానుంది. ఇకపై రిటైర్డ్ ఉద్యోగులు సచివాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే నిధులు జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది.

## బెంగాల్‌లో ఓటింగ్ శాతాన్ని చూసి చాలా సంతోషించా

పశ్చిమ బెంగాల్‌లో మొదటి దశలో పోలింగ్ శాతం అత్యధికంగా నమోదు కావడంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హర్షం వ్యక్తం చేశారు. భారత పౌరుడిగా బెంగాల్‌లో జరిగిన ఓటింగ్ శాతాన్ని చూసి చాలా సంతోషించానని వ్యాఖ్యానించారు. బెంగాల్ మొదటి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అలాగే అత్యధిక పోలింగ్ శాతం నమోదైంది. శుక్రవారం 'ఎస్ఐఆర్' కేసు విచారణ సందర్భంగా పోలింగ్ శాతంపై సుప్రీంకోర్టు స్పందించింది. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంపై ప్రశంసలు కురిపించింది. ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించడం, ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓటు వేయడం చాలా ఆనందంగా ఉందని పేర్కొంది. ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమవుతుందని వ్యాఖ్యానించింది. ప్రజలు తమ ఓటుకు ఉన్న శక్తిని తెలుసుకుంటే ఎటువంటి హింసాత్మక ఘటనలకు పాల్పడబోరని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. కాగా, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పశ్చిమ బెంగాల్‌లో ఓటింగ్ శాతం ఈ స్థాయిలో నమోదు కావడం ఇదే మొదటిసారి అని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అన్నారు. బెంగాల్‌లో మొదటి దశలో 152 స్థానాలకు పోలింగ్ జరగగా, ఓటింగ్ శాతం 92 శాతం దాటింది. దక్షిణ్ దినాజ్‌పూర్, కూచ్ బెహార్, బీర్‌భుమ్ జిల్లాల్లో ఓటింగ్ శాతం 95 శాతానికి పైగా నమోదైంది.

## కొత్త AI 'మిథోస్' కలకలం.. బ్యాంకర్లకు నిర్మలా సీతారామన్ హెచ్చరిక

సీతారామన్ గురువారం వివిధ బ్యాంకుల అధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా పాల్గొన్నారు. ఆంత్రోపిక్ అనే AI స్టార్టప్ అభివృద్ధి చేసిన 'క్లాడ్ మిథోస్' సైబర్ భద్రత విషయంలో అత్యంత అధునాతనమైనదిగా పేరుపొందింది. మనుషులు గుర్తించడంలో విఫలమైన వేలాది సైబర్ భద్రతా లోపాలను ఇది కనుగొన్నట్లు సమాచారం. కొన్ని ఆపరేటింగ్ సిస్టమ్స్‌లో 27 ఏళ్లుగా ఉన్న లోపాలను కూడా ఇది బయటపెట్టింది. అందుకే దీన్ని సాధారణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఒకవేళ ఇది చెడు ఉద్దేశాలున్న వారి చేతికి చిక్కితే, అధునాతన హ్యాకింగ్ సామర్థ్యాలు పొందినట్లేనని ఆంత్రోపిక్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కొందరు అనధికారికంగా ఈ AIని యాక్సెస్ చేశారన్న వార్తలు ఆందోళన రేపుతున్నాయి. ఈ ముప్పు అసాధారణమైనదని, బ్యాంకులు, ఆర్థిక సంస్థల మధ్య అత్యంత జాగరూకత, సమన్వయం అవసరమని ఆర్థిక మంత్రిత్వ శాఖ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. బ్యాంకులు తమ ఐటీ వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవాలని, వినియోగదారుల డేటాను కాపాడేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్ ఆదేశించారు. ముప్పును నిజ సమయంలో గుర్తించి, దాని వివరాలను బ్యాంకులు, ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (CERT-In) వంటి సంస్థల మధ్య పంచుకోవడానికి ఒక బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తక్షణమే స్పందించేందుకు వీలుగా ఒక సమన్వయ సంస్థాగత యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (IBA)కు మంత్రి సూచించారు. కేవలం భారత్‌లోనే కాకుండా, అమెరికా ప్రభుత్వం కూడా 'మిథోస్' ముప్పుపై వాల్‌స్ట్రీట్ బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. మరోవైపు, ఈ AI వల్ల భారత ఆర్థిక రంగానికి ఎంత మేరకు ప్రమాదం ఉందనే అంశంపై ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) అధ్యయనం చేస్తున్నాయి.

## రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

సమాచారం వస్తోందని తెలిపారు.

దిగుబడుల్లో తాలు అధికంగా ఉన్నాయని అధికారులు చెబుతున్న నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశించినంతగా లేదని, అప్పులు తెచ్చుకుంటేనే ప్రభుత్వం నడుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా వచ్చే మూడు నెలలు (ఏప్రిల్, మే, జూన్) ఆర్థికంగా క్లిష్టంగా ఉండే అవకాశముందని పేర్కొన్నారు. ఆర్టీసీ సమ్మె విషయంలో అన్ని రాజకీయ పార్టీలూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్మికులను రెచ్చగొట్టకూడదని, కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రైతు భరోసా, సన్న వొడ్లకు బోనస్ అంశంపై రైతుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలిపారు. కొందరు బోనస్ సరైందని భావిస్తుండగా, మరికొందరు పూర్తి స్థాయి రైతు భరోసా ఇవ్వాలని కోరుతున్నారని చెప్పారు. ప్రభుత్వం అందరికీ సక్రమంగా రైతు భరోసా నిధులు అందేలా చూడాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి హైకోర్టు తీర్పులో ఎవరికీ క్లిన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. సెక్షన్ 8 కింద నోటీసులు ఇవ్వకపోవడంతో కేసీఆర్, హరీష్ రావు పై చర్యలు తీసుకోవద్దని కోర్టు పేర్కొన్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తాను గతంలోనే ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు. ఈ ప్రాజెక్ట్ భవిష్యత్తులో భారీ ఆర్థిక భారంగా మారే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. సీబీఐ విచారణ వేగవంతం చేయడానికి ఒత్తిడి తేవడం ప్రభుత్వ నిర్ణయమని తెలిపారు. యువతకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తాను భవిష్యత్తులో పోటీ చేసే విషయంలో పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటానని, యువతకు అవకాశాలు ఇవ్వడాన్ని వ్యతిరేకించనని చెప్పారు. నల్గొండ నుంచా లేదా ఇతర ప్రాంతం నుంచా పోటీ చేయాలనే విషయాన్ని ఇప్పుడే చెప్పలేనని స్పష్టం చేశారు.

## ఆర్టీసీ కార్మాకులకు రేవంత్ తీరని ద్రోహం



ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. పు÷–టటెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు, బీఆర్ఎస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టుచేయడం చాలా దారుణమని అన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయడంతోపాటు, శంకర్ గౌడ్ కుటుంబసభ్యులు, ఆర్టీసి కార్మికుల విజ్ఞప్తిమేరకు ఆర్టీసి డిపో వద్ద నివాళులు అర్పించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే శంకర్ గౌడ్ గారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా, కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నామని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటికీ నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసీ కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోందని కేటీఆర్ అన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి ఉంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకూ మనమంతా కలిసి సంఘటితంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

శుక్రవారం ఏప్రిల్ 24 2026

ninadam.in




## కోటక్ మహీంద్రా బ్యాంకులో భారీ మోసం..

# రూ.145 కోట్ల మున్సిపల్ నిధుల గోల్‌మాల్

- పంచకుల మున్సిపల్ కార్పొరేషన్ నిధుల కేసులో ఈడీ సోదాలు
- చండీగఢ్, పంజాబ్‌లోని 12 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- నకిలీ ఖాతాలు సృష్టించి ప్రభుత్వ నిధులు మళ్లించినట్లు ఆరోపణలు
- దాడుల్లో మనీలాండరింగ్‌కు సంబంధించిన కీలక పత్రాలు స్వాధీనం




**చండీగఢ్, ఏప్రిల్ 24 (నినాదం) :** పంచకుల మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన రూ.145 కోట్ల నిధుల గోల్‌మాల్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (ఫ్రీమీూ) కింద ఏప్రిల్ 22న చండీగఢ్, పంచకుల, జిరక్‌పూర్, డేరా బస్సీ, రాజ్‌పురా సహా మొత్తం 12 ప్రాంతాల్లో ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో మనీలాండరింగ్‌కు సంబంధించిన కీలక పత్రాలు, ఆస్తుల క్రయవిక్రయ ఒప్పందాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. అవినీతి నిరోధక శాఖ (ACB), పంచకుల నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసులో దర్యాప్తు ప్రారంభించింది. పంచకుల మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సుమారు రూ.145 కోట్ల నిధులను పక్కా ప్రణాళికతో కూడిన నేరపూరిత కుట్ర ద్వారా బ్యాంకు అధికారులు కొందరు దుర్వినియోగం చేశారని ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు ప్రకారం, మున్సిపల్ అధికారులు, బ్యాంకు ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు కుమ్మక్కై ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించినట్లు తేలింది. కోటక్ మహీంద్రా బ్యాంకుకు చెందిన కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్ దిలీప్ కుమార్ రాఘవ్, డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ పుష్పిందర్ సింగ్, కార్పొరేషన్ మాజీ సీనియర్ అకౌంట్స్ అధికారి వికాస్ కౌశిక్‌లు ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు ఈడీ గుర్తించింది. వీరు నకిలీ పత్రాలతో మున్సిపల్ కార్పొరేషన్ పేరు మీద రెండు అనధికారిక బ్యాంకు ఖాతాలను తెరిచారు. అనంతరం నకిలీ అధికారిక లేఖలు, అనధికారిక ఈ-మెయిల్ ఐడీలను ఉపయోగించి కార్పొరేషన్ అసలు ఖాతాల నుంచి ఈ నకిలీ ఖాతాలకు నిధులను మళ్లించారు. ఈ డబ్బును ఫైనాన్షియర్లు, రియల్ ఎస్టేట్ సంస్థల ద్వారా పలుమార్లు బదిలీ చేసి, చివరికి ప్రధాన నిందితులు, వారి సహచరులకు చేరేలా చేశారు. ఈ భారీ మోసాన్ని కప్పిపుచ్చేందుకు, సుమారు రూ.145 కోట్ల విలువైన నకిలీ ఫిక్స్‌డ్ డిపాజిట్ రసీదులను కార్పొరేషన్‌కు జారీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో పుష్పిందర్ సింగ్, రజత్ దహ్రా, దిలీప్ కుమార్ రాఘవ్, వికాస్ కౌశిక్ సహా ఇతరులకు చెందిన ప్రాంగణాల్లో సోదాలు జరిగాయి.

## ప్రకృతి ప్రేమికుడు దుశ్చర్లపై గొర్రెల కాపరుల దాడి

- సూర్యాపేట జిల్లా రాఘవాపురంలో ఘటన
- అడవిలో గొర్రెలు మేపొద్దన్నందుకు కర్రలు, రాళ్లతో దాడి
- తలపై తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స
- భూమి కోసమే హత్యాయత్నం జరిగిందని ఆరోపణ



**సూర్యాపేట ఏప్రిల్ 24 (నినాదం) :** ప్రకృతి ప్రేమికుడు, జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుశ్చర్ల సత్యనారాయణపై గొర్రెల కాపరులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురం గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ దాడిలో సత్యనారాయణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. రాఘవాపురంలో తనకున్న 70 ఎకరాల భూమిలో దుశ్చర్ల సత్యనారాయణ ఎన్నో ఏళ్లుగా మొక్కలను పెంచి దాన్ని ఒక దట్టమైన అడవిగా మార్చారు. గురువారం ఆయన లేని సమయంలో కొందరు గొర్రెల కాపరులు తమ గొర్రెలను ఆ అడవిలో మేపుతూ చెట్ల కొమ్మలను నరుకుతున్నారు. గురువారం రాఘవాపురానికి చెందిన గొర్రెల కాపర్లు బయ్య గంగయ్య, మల్లయ్య ఆ అడవిలో చెట్లు నరుకుతూ, గొర్రెలను మేపుతూ కనిపించారు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన సత్యనారాయణ తన అడవిలో గొర్రెలను ఎందుకు మేపుతున్నారని వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి, గొర్రెల కాపరులు కర్రలు, రాళ్లు, గొడ్డళ్లతో ఆయనపై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు. "మా ఇష్టం, ఇక్కడే మేపుతాం" అని బెదిరించి తనపై దాడి చేశారని సత్యనారాయణ తెలిపారు. తన 70 ఎకరాల అడవిని ఆక్రమించుకునేందుకే పథకం ప్రకారం తనపై హత్యాయత్నం చేశారని ఆయన ఆరోపించారు. తనకు రక్షణ కల్పించి, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

### ప్రేమ వివాహం వివాదం..

## మద్యం సీసాలో మూత్రం పోసి.. 70 ఏళ్ల వృద్ధుడి చేత తాగించిన వైనం

- ఈ అమానుష ఘటనను వీడియో తీసి వైరల్ చేసిన దుండగులు
- వైరల్ వీడియోతో రంగంలోకి దిగిన పోలీసులు

**రైసెన్, ఏప్రిల్ 24 (నినాదం) :** మధ్యప్రదేశ్‌లో అత్యంత అమానుషమైన ఘటన వెలుగులోకి వచ్చింది. తమ కుమార్తెను ప్రేమ పెళ్లి చేసుకుని తీసుకెళ్లిపోయాడన్న కోపంతో యువతి కుటుంబ సభ్యులు.. 70 ఏళ్ల వృద్ధుడైన యువకుడి తండ్రిని కిడ్నాప్ చేసి, దారుణంగా కొట్టి, మద్యం సీసాలో మూత్రం పోసి బలవంతంగా తాగించారు. ఈ అమానుషాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. రైసెన్ జిల్లాకు చెందిన ఓ యువకుడు, విదిశ జిల్లాకు చెందిన యువతి మార్చి 5న ప్రేమ వివాహం చేసుకుని ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. మరుసటి రోజే దీనిపై కేసు నమోదైంది. మార్చి 7న యువతి కుటుంబ సభ్యులు సుమారు 12 మంది రెండు వాహనాల్లో రైసెన్‌కు చేరుకున్నారు. యువతి ఆచూకీ చెప్పాలంటూ ఆమె ప్రియుడి తండ్రి అయిన వృద్ధుడిపై దాడి చేశారు. అనంతరం, ప్రేమజంటను వెతుకుదామనే నెపంతో వృద్ధుడిని బలవంతంగా తమ వాహనాల్లో ఎక్కించుకుని రాజ్‌గఢ్ జిల్లాలోని మోతీపుర గ్రామంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ వారి ఆచూకీ చెప్పకపోవడంతో, వృద్ధుడిని తీవ్రంగా కొట్టి, మద్యం సీసాలో మూత్రం పోసి బలవంతంగా తాగించారు. ఈ మొత్తం ఘటనను వీడియో తీసి ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశారు. ఈ ఘటన గత నెలలో జరగ్గా బుధవారం వీడియో వైరల్ కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రాజ్‌గఢ్ పోలీసులు, బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నామని తెలిపారు. వీడియో ఆధారంగా మిగిలిన నిందితులను గుర్తించి, వారిని అరెస్ట్ చేసేందుకు గాలిస్తున్నామని పోలీసులు వివరించారు.

### ఢిల్లీలో ఐఐటీ గ్రాడ్యుయేట్ పై అత్యాచారం, హత్య..

## నిందితుడు చెప్పిన విషయాలతో పోలీసుల షాక్!

- ఢిల్లీలో ఐఆర్ఎస్ అధికారి కుమార్తెపై అత్యాచారం, హత్య
- నిందితుడు 19 ఏళ్ల మాజీ పనిమనిషి రాహుల్ మీనాగా గుర్తింపు
- హత్యకు ముందు రోజు రాజస్థాన్‌లో మరో మహిళపై అత్యాచారం
- కోర్టులో తన నేరాన్ని అంగీకరించిన నిందితుడు
- దోపిడీ కోసమే ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసుల వెల్లడి



**ఢిల్లీ, ఏప్రిల్ 24 (నినాదం) :** రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఒక మహిళపై అత్యాచారం చేసి, మరుసటి రోజు ఉదయాన్నే ఢిల్లీకి వచ్చి తన మాజీ యజమాని కుమార్తెపై అత్యాచారం చేసి, అత్యంత పాశవికంగా హత్య చేసిన 19 ఏళ్ల యువకుడి ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఢిల్లీలోని కైలాశ్ హిల్స్‌లో జరిగిన ఈ దారుణ ఘటనలో నిందితుడైన రాహుల్ మీనాను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడు రాహుల్ మీనా ఒక ఐఆర్ఎస్ అధికారి ఇంట్లో 8 నెలలు పనిచేసి, ఆర్థిక అవకతవకల కారణంగా నెల రోజుల క్రితం అతడిని పని లోంచి తీసేశారు. దీంతో పగ పెంచుకున్న రాహుల్ బుధవారం ఉదయం ఆ ఇంట్లోకి చొరబడ్డాడు. ఆ సమయంలో యువతి తల్లిదండ్రులు జిమ్‌కు వెళ్లడంతో, అదనపు తాళం చెవి వాడి ఇంట్లోకి ప్రవేశించాడు. సివిల్స్‌కు సిద్ధమవుతున్న 22 ఏళ్ల ఐఐటీ గ్రాడ్యుయేట్ అయిన ఆ యువతిపై దాడి చేసి, మొబైల్ ఛార్జింగ్ కేబుల్‌తో గొంతు నులిమి, బరువైన వస్తువుతో కొట్టి అపస్మారక స్థితికి చేర్చాడు. ఆ తర్వాత ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం బయోమెట్రిక్ లాకర్‌ను ఆమె వేలిముద్రతో తెరిచేందుకు ప్రయత్నించి విఫలమై, స్క్రూడ్రైవర్‌తో పగలగొట్టి నగదు, నగలు దోచుకున్నాడు. రక్తంతో తడిసిన బట్టలు మార్చుకుని అక్కడి నుంచి పారిపోయాడు. సీసీటీవీ ఫుటేజీ ప్రకారం ఉదయం 6:49 గంటలకు ఇంట్లోకి ప్రవేశించి 7:20 గంటలకు బయటకు వెళ్లిపోయాడు. పోలీసులు అతడిని ద్వారకలోని ఒక హోటల్‌లో అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరుపర్చారు. "నా వల్ల నేరం జరిగింది, తప్పు జరిగిపోయింది" అని న్యాయమూర్తి ముందు నిందితుడు తన తప్పును అంగీకరించాడు. ఈ హత్యకు ముందురోజు రాత్రి, అల్వార్‌లో తనకు తెలిసిన వ్యక్తి భార్యపై కూడా రాహుల్ అత్యాచారం చేసినట్లు మరో కేసు నమోదైంది. నిందితుడిని నాలుగు రోజుల కస్టడీకి తీసుకున్న పోలీసులు, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదికలో గొంతు నులమడం వల్లే యువతి మరణించిందని తేలింది.

## పేదరికాన్ని జయిస్తూ హాకీలో దూసుకెళ్తున్న 15 ఏళ్ల నౌషీన్

- దినసరి కూలీ కుమార్తె... జాతీయ హాకీలో సత్తా
- విరిగిన హాకీ స్టిక్‌తో శిక్షణ ప్రారంభించిన నౌషీన్
- మధ్యప్రదేశ్ హాకీ అకాడమీతో మారిన తలరాత
- అండర్-18 ఆసియా కప్ జట్టులో స్థానం కోసం పోటీ
- దేశానికి ఆడటమే తన ఏకైక లక్ష్యమని వెల్లడి



**భోపాల్, ఏప్రిల్ 24 (నినాదం) :** తోటి క్రీడాకారులు ఖరీదైన కిట్లతో శిక్షణ తీసుకుంటుంటే ఆమె మాత్రం అరువు తెచ్చుకున్న సామాగ్రితో సాధన చేస్తోంది. కనీసం ఒక మంచి హాకీ స్టిక్ కూడా కొనలేని నిరుపేద కుటుంబం ఆమెది. కానీ, 15 ఏళ్ల నౌషీన్ నాజ్ ఇప్పుడు భారత మహిళల హాకీ భవిష్యత్ ఆశాకిరణంగా వెలుగొందుతోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ యువ క్రీడాకారిణి, త్వరలో జపాన్‌లో జరగనున్న అండర్-18 ఆసియా కప్ జట్టులో స్థానం సంపాదించేందుకు అడుగు దూరంలో నిలిచింది. నౌషీన్ తండ్రి అఫ్ఫాజ్ ఖాన్ రోజుకు కేవలం రూ.250 సంపాదించే ఒక దినసరి కూలీ. భోపాల్‌కు 380 కిలోమీటర్ల దూరంలోని సియోని పట్టణంలో కనీసం పైకప్పు కూడా లేని ఓ అద్దె ఇంట్లో వారి నివాసం. నాలుగేళ్ల క్రితం పాత, విరిగిన హాకీ స్టిక్‌తో నౌషీన్ ప్రస్థానం మొదలైంది. "అది విరిగిపోయిన ప్రతీసారి గుడ్డతో కట్టుకుని ఆడేది తప్ప ఏరోజూ ఫిర్యాదు చేయలేదు" అని ఆమె తండ్రి గతాన్ని గుర్తుచేసుకున్నారు. 2023లో మధ్యప్రదేశ్ హాకీ అకాడమీ కంటపడటంతో ఆమె జీవితం మలుపు తిరిగింది. శిక్షణ, పౌష్టికాహారం, క్రీడా సామాగ్రి అన్నీ అకాడమీయే సమకూర్చింది. ఈ నెలలో బిహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన 16వ సబ్-జూనియర్ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో నౌషీన్ సత్తా చాటింది. ఏకంగా 9 గోల్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలవడమే కాకుండా, 'ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్' అవార్డును కూడా గెలుచుకుంది. ఆట కోసం కూతురు వేసుకునే దుస్తులపై కొందరు విమర్శలు చేసినా, ఆమె తండ్రి అండగా నిలుస్తున్నారు. "నా కూతురిని ఎవరైనా ఆపాలని చూస్తే, ముందు నాతో తలపడాలి" అని ఆయన ధైర్యంగా చెబుతున్నారు. ఏడుగురు సంతానంలో ఒకరైన నౌషీన్ స్ఫూర్తితో ఆమె చెల్లెలు సబారికా కూడా అకాడమీలో చేరింది. "దేశం కోసం ఆడటమే నా ఏకైక లక్ష్యం" అని నౌషీన్ తన ఆశయాన్ని స్పష్టం చేసింది.

## గుజరాత్‌లో పరువు హత్య.. చెల్లి ప్రియుడిని కొట్టి చంపిన అన్నలు


- పాత ప్రేమ వ్యవహారమే హత్యకు ప్రధాన కారణం
- యువతి ముగ్గురు సోదరుల కిరాతక చర్య
- రెండు గంటల పాటు బెల్టులు, తాడుతో కొట్టి చంపిన వైనం
- నిందితులు ముగ్గురినీ అరెస్ట్ చేసిన పోలీసులు

**రాజులా ఏప్రిల్ 24 (నినాదం) :** గుజరాత్‌లోని రాజులాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పాత ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ముగ్గురు సోదరులు కలిసి ఓ యువకుడిని అత్యంత కిరాతకంగా కొట్టి చంపారు. తమ చెల్లెలితో ప్రేమ వ్యవహారం నడిపాడన్న కోపంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు దినేష్‌కు, నిందితుల సోదరి సోనాల్‌కు మధ్య ఏడాది క్రితం ప్రేమ వ్యవహారం నడిచింది. ఆ సమయంలో దినేష్ ఆమెను మొర్బీకి తీసుకెళ్లాడు. అయితే, రెండు నెలల తర్వాత సోనాల్ తిరిగి తన తండ్రి ఇంటికి వచ్చింది. అప్పటి నుంచి ఇరు కుటుంబాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే దినేష్‌ను చంపేస్తామని నిందితులు గతంలో బెదిరించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 18న దినేష్, వ్యవసాయ కూలీలతో కలిసి మొర్బీ నుంచి వచ్చి తన స్నేహితుడి పొలానికి వెళ్లాడు. రాత్రి 8:30 గంటల సమయంలో పొలంలో స్నేహితుడితో కూర్చుని ఉండగా, సోనాల్ సోదరులైన రాజేష్, సుర్‌సింగ్, కేవల్ బైక్‌పై అక్కడికి చేరుకున్నారు. దినేష్‌ను కాస్త దూరంగా తీసుకెళ్లి, 'మా చెల్లిని తీసుకెళ్లి మా పరువు తీశావు' అంటూ వాగ్వివాదానికి దిగారు. ఆ తర్వాత అతడిపై దాడికి దిగారు. రాజేష్ తన బెల్టు తీసి కొట్టగా, సుర్‌సింగ్ తాడుతో తలపై దాడి చేశాడు. కేవల్ కూడా బెల్టుతో విచక్షణారహితంగా కొట్టాడు. దాదాపు రెండు గంటల పాటు ముగ్గురూ ఒకరి తర్వాత ఒకరు బెల్టులు, తాళ్లతో దినేష్‌ను తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన దినేష్‌ను ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. పరువు కోసమే ఈ హత్య జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

# ఆ ఉగ్ర నేతను పట్టిస్తే రూ.94 కోట్లు..

## అమెరికా భారీ నజరానా ప్రకటన

- ఇరాక్ మిలీషియా నేత అబూ వాలా అల్ వాయెలీపై అమెరికా రివార్డు
- వాయెలీ ఇరాన్ మద్దతుతో నడిచే కతాయెబ్ సయ్యద్ అల్ షుహాదా నాయకుడు
- అమెరికా దళాలు, దౌత్య సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్నందున ఈ నిర్ణయం
- సమాచారం అందించిన వారికి రక్షణతో పాటు పునరావాసం కల్పిస్తామన్న అమెరికా విదేశాంగ శాఖ
- గతంలో అమెరికా దళాలకు చిక్కి జైలు శిక్ష అనుభవించిన వాయెలీ



**ఢిల్లీ, ఏప్రిల్ 24 (నినాదం) :** ఇరాక్‌లో ఇరాన్ మద్దతుతో పనిచేస్తున్న ఓ కీలక మిలీషియా నాయకుడిని పట్టిచ్చేందుకు అమెరికా భారీ నజరానా ప్రకటించింది. కతాయెబ్ సయ్యద్ అల్ షుహాదా (KSS) అనే ఉగ్రవాద సంస్థకు నాయకుడైన హాషీమ్ ఫిన్యాన్ రహీమ్ అల్-సరాజీ అలియాస్ అబూ వాలా అల్ వాయెలీని అరెస్ట్ చేయడానికి దారితీసే సమాచారం అందిస్తే 10 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 94 కోట్లు) రివార్డుగా ఇస్తామని ప్రకటించింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన "రివార్డ్స్ ఫర్ జస్టిస్" కార్యక్రమం కింద ఈ ప్రకటన వెలువడింది. ఇరాక్, సిరియాలలో అమెరికా దళాలు, దౌత్య కార్యాలయాలపై దాడులకు, ఇరాకీ పౌరుల మరణాలకు వాయెలీ నేతృత్వంలోని గ్రూప్ బాధ్యత వహించాలని అమెరికా ఆరోపించింది. సమాచారం అందించిన వారికి పూర్తి రక్షణతో పాటు, అవసరమైతే పునరావాసం కూడా కల్పిస్తామని స్పష్టం చేసింది. ఇరాక్‌లో ఇరాన్ అనుకూల మిలీషియాలపై ఒత్తిడి పెంచి, వాటిని కట్టడి చేసే కొత్త ప్రధానమంత్రి నియామకాన్ని ప్రోత్సహించే వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**ఎవరీ అబూ వాలా అల్ వాయెలీ?**

అబూ వాలా అల్ వాయెలీ కేఎస్ఎస్ గ్రూప్‌లో చేరకముందు కతాయెబ్ హిజ్బుల్లా (KH) అనే మరో అమెరికా వ్యతిరేక షియా మిలీషియాలో సభ్యుడిగా ఉండేవాడు. ఆ సమయంలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినందుకు అమెరికా దళాలకు పట్టుబడి 2010లో విడుదలయ్యాడు. ఆ తర్వాత సిరియా అంతర్యుద్ధం సమయంలో కేఎస్ఎస్ గ్రూప్‌లో చేరాడు. వాయెలీ నాయకత్వం వహిస్తున్న కేఎస్ఎస్ సంస్థ, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) భావజాలంతో, వారి మద్దతుతో పనిచేస్తుంది. ఈ సంస్థ యెమెన్‌లోని హౌతీలకు కూడా తన మద్దతు ప్రకటించింది. విచిత్రమేమిటంటే, కేఎస్ఎస్ ఫైటర్లు ఇరాక్ అధికారిక భద్రతా దళాల్లో భాగమైన పాప్యులర్ మొబిలైజేషన్ కమిటీ (PMC)లోని 14వ బ్రిగేడ్‌గా కూడా కొనసాగుతున్నారు. కేఎస్ఎస్ కార్యకలాపాలను గమనించిన అమెరికా, 2023 నవంబర్ 17న వాయెలీని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. గడిచిన దశాబ్ద కాలంలో ఈ గ్రూపు అమెరికా దళాలపై దాదాపు 1,000 దాడులకు పాల్పడినట్లు నివేదికలున్నాయి.

## నాలుక చీరేస్తానంటూ పబ్లిషర్‌కు శివసేన ఎమ్మెల్యే హెచ్చరిక

- శివాజీ మహారాజ్‌పై రాసిన పుస్తకంపై శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ఆగ్రహం
- పబ్లిషర్‌కు ఫోన్ చేసి హత్యకు గురైన రచయిత పన్సారే గతే నీకూ పడుతుందని హెచ్చరిక
- ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పబ్లిషర్.. రక్షణ కల్పించాలని విజ్ఞప్తి
- గైక్వాడ్ చర్యను ఖండించిన ప్రతిపక్షాలు.. విచారణకు డిమాండ్







**ముంబై, ఏప్రిల్ 24 (నినాదం) :** మహారాష్ట్రలో శివసేన ఏక్‌నాథ్ షిండే వర్గం ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, ఓ పుస్తక ప్రచురణకర్తకు ప్రాణహాని కలిగించేలా బెదిరింపులకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఛత్రపతి శివాజీ మహారాజ్‌పై రాసిన ఓ పుస్తకం విషయంలో ప్రచురణకర్త ప్రశాంత్ అంబిని ఫోన్‌లో దుర్భాషలాడుతూ, తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కమ్యూనిస్టు నేత, దివంగత గోవింద్ పన్సారే 38 ఏళ్ల క్రితం రాసిన 'శివాజీ కోన్ హోతా' (శివాజీ ఎవరు?) అనే మరాఠీ పుస్తకాన్ని కొల్హాపూర్‌కు చెందిన ప్రశాంత్ అంబి ప్రచురించి, నామమాత్రపు ధరకు పంపిణీ చేస్తున్నారు. ఈ పుస్తకం పేరులో 'ఛత్రపతి', 'మహారాజ్' వంటి గౌరవసూచకాలు లేకపోవడంపై ఎమ్మెల్యే గైక్వాడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 22న అర్ధరాత్రి దాటాక తనకు ఫోన్ చేసి "నీ నాలుక కోస్తా.. ఇంట్లోకి వచ్చి కొడతా.. నీకు కూడా రచయిత పన్సారే గతే పడుతుంది" అని గైక్వాడ్ బెదిరించినట్లు అంబి ఆరోపించారు. ఈ బెదిరింపులతో తన కుటుంబం తీవ్ర భయాందోళనలకు గురైందని చెబుతూ, కొల్హాపూర్‌లోని రాజారాంపురి పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. గైక్వాడ్‌పై కేసు నమోదు చేసి, తమకు రక్షణ కల్పించాలని కోరారు. కాగా, 2015లో గోవింద్ పన్సారే మార్నింగ్ వాక్ చేస్తుండగా హత్యకు గురయ్యారు. ఈ వివాదంపై స్పందించిన ఎమ్మెల్యే గైక్వాడ్ ఆ ఆడియో క్లిప్‌లోని గొంతు తనదేనని అంగీకరించారు. అయితే, దానిని ఎడిట్ చేసి వక్రీకరించారని ఆరోపించారు. శివాజీని అవమానించేలా ఉన్న పుస్తకాన్ని నాశనం చేయాలని, ప్రచురణకర్త అహంకారంగా మాట్లాడారని ఆయన అన్నారు. ఈ ఘటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఇది "బహిరంగ గూండాయిజం" అని, ముఖ్యమంత్రి ఫడ్నవీస్ వెంటనే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేసింది. ఎమ్మెల్యే గైక్వాడ్ వివాదాల్లో చిక్కుకోవడం ఇది మొదటిసారి కాదు. గతంలోనూ పలు వివాదాస్పద వ్యాఖ్యలు, చర్యలతో ఆయన వార్తల్లో నిలిచారు.

## ఢిల్లీ పర్యటనలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

- పార్టీ పెద్దలతో భేటీ వివరాలు చెప్పేందుకు నిరాకరణ
- కర్ణాటక కాంగ్రెస్‌లో అసంతృప్తి వార్తల నడుమ ప్రాధాన్యం సంతరించుకున్న పర్యటన
- బెంగళూరు అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చించనున్నట్లు వెల్లడి



**ఢిల్లీ, ఏప్రిల్ 24 (నినాదం) :** కర్ణాటక కాంగ్రెస్‌లో అంతర్గత అసమ్మతి సెగలు కొనసాగుతున్న వేళ, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటన తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. తాను కేవలం గాలి పీల్చుకోవడానికి ఢిల్లీకి రాలేదని, పార్టీ పెద్దలతో సమావేశమయ్యానని, అయితే ఆ వివరాలను వెల్లడించబోనని ఆయన స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలతో కర్ణాటక రాజకీయాల్లో మరోసారి చర్చ మొదలైంది. గురువారం రాత్రి ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన డీకే శివకుమార్.. రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఊహాగానాలపై స్పందించేందుకు నిరాకరించారు. "బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అలాంటి విషయాలు మీడియా ముందు చర్చించలేను. దయచేసి నా నుంచి ఆ సమాచారం రాబట్టే ప్రయత్నం చేయవద్దు" అని అన్నారు. అలాగే తమిళనాడు, కేరళ, అస్సాం ఎన్నికల ప్రచారంపై పార్టీకి నివేదిక ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రికి సన్నిహితులైన మంత్రులు సమావేశమయ్యారన్న వార్తలపై తనకు ఎలాంటి సమాచారం లేదని డీకే శివకుమార్ అన్నారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ కోసం కొందరు ఎమ్మెల్యేలు మళ్లీ ఢిల్లీకి వెళ్లనున్నారన్న ప్రచారంపై 'వేచి చూద్దాం' అంటూ సమాధానం దాటవేశారు. ముస్లిం నేతల్లో ఉన్న అసంతృప్తిపై పార్టీ స్థాయిలో తమకు కొంత సమాచారం అందిందని, అందరం కలిసి పనిచేయాలని చెప్పారు. తాను కుటుంబంతో కలిసి హైదరాబాద్ కు వెళ్లి, అక్కడి నుంచి ఢిల్లీ వచ్చినట్లు తెలిపారు. బెంగళూరుకు సంబంధించిన కొన్ని అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చించాల్సి ఉందని, శుక్రవారం ఉదయం 11:45 గంటలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీకి సమయం తీసుకున్నట్లు వెల్లడించారు. మైనారిటీ నేతల సస్పెన్షన్ రద్దు డిమాండ్‌పై స్పందిస్తూ.. "వారిని ఎవరు సస్పెండ్ చేశారు? వారే తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలో ఏముందో పరిశీలించండి" అని డీకే వ్యాఖ్యానించారు.